### ఉర్దూఘర్, షాది ఖానా యాజమాన్య కమిటీ అధ్యక్షులుగా

# నయీామ్ ఖురేషి ఎన్నిక

**కొత్తగూడెం, మార్చి17(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం షాదిఖానా, ఉర్దూఘర్ యాజమాన్య, నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా నయీామ్ ఖురేషి ఎన్నికయ్యారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె పాషా ఆదివారం నయీామ్ ఖురేషితో పాటు నూతన కమిటీ నాయకులు మహమూద్ అహమ్మద్, మహమ్మద్ షరీఫ్, అబ్దుల్ ముఖిద్ సటే, ఎండి. ఋక్షణాలకు పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఉర్దూఘర్, షాది ఖానా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, పేద కుటుంబాలు శుభకార్యాలు జరుపుకునేందుకు అందుబాటులో ఉన్న షాది ఖానా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోందని దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పేద కుటుంబాలకు అందుబాటులో తేవాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. జిల్లా కేంద్రానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షులు నయీామ్ ఖురేషి మాట్లాడుతూ షాది ఖానా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో అదే విధంగా సహా కమిటీ నాయకుల సహకారంతో షాదిఖానాలో సకల సౌకర్యాలు కల్పించి పేదలకు పూర్తిస్థాయిలో అందుబాటులో తెస్తామని తెలిపారు. శుభకార్యాలు జరుపుకునేందుకు కులమతాలకతీతంగా పేదలకు షాది ఖానా ఉచితంగా అందిస్తామని తెలిపారు. సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని కోరారు. తమకు భాధ్యతలు అప్పగించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హమీద్, రిస్కిన్, అభిద్ హుస్సేన్, రంజాన్ ఖాన్, సయ్యద్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**అభినందనలు తెలిపిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా**







## ఈనెల 30, 31 తేదీలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పై కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మార్చి17(కెరటం ప్రతినిధి)**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పై భారతదేశంలో అతిపెద్ద కాన్ఫరెన్స్ ఏఐ డేస్ 2024 హైదరాబాద్‌లో ఈనెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నట్లు స్వేచ్ఛా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని స్వేచ్ఛా తెలంగాణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ వేదిక కానుందన్నారు. ఈ సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గల 70కి పైగా స్పీకర్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో తెలుగు ఏఐ వాయిస్ అసిస్టెంట్‌ను ప్రారంభించనున్నామని తెలిపారు. రైతులు, ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతరులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ మాతృభాషలో సొంత స్వరాన్ని ఉపయోగించి ఏఐతో పరస్పర చర్యకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కాన్ఫరెన్స్ సమయంలో ప్రారంభిం చబడే మరో ప్రాజెక్ట్ అధిక పనితీరు పంపిణీ చేయబడిన సూపర్ కంప్యూటర్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణాలోని పదివేల కంప్యూట ర్లను కలుపుతుందన్నారు. కాన్ఫరెన్స్ కోసం https://aidays.io /registerలో నమోదు చేసుకోండి. ఈ కాన్ఫరెన్స్‌లోని ప్రముఖ వక్తలు పద్మభూషణ్ డాక్టర్ వీఎస్ రామచంద్రన్, టైమ్ మ్యాగజైన్‌లో ప్రపంచంలోని వంద మంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో ఉన్నారు. మొబైల్ పేమెంట్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ గౌరవ్ రైనా, గూగుల్‌లో ఏఐ/ఎంఎల్ లీడర్ డాక్టర్ ఆశిష్ టెండూల్కర్, ఫౌండర్ సీటీవో ఓజోనెటెల్ చైతన్య, టెక్ మహీంద్రా వీపీ నాగ్ మల్లాది, స్వేచ్ఛా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర, సీనియర్ సలహాదారు, సాలమండర్ నాగి వీ, ఫేస్‌బుక్ ఇండియా డైరెక్టర్ సునీల్ అబ్రహం, టెక్ వేదిక ఫౌండర్ సీఈవో సాయి ఎస్, ఆర్కా మీడియా వర్క్స్ వ్యవస్థాపకుడు, బాహుబలి సిరీస్ నిర్మాత శోభు యార్లగడ్డ ఉన్నారు.

# భారతరత్న అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని పరిరక్షించాలి

- భారత రాజ్యాంగ సృష్టికర్తను కించపరచవద్దు ! అవమానపరచవద్దు!!
- భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్!



**కొత్తగూడెం, మార్చి17(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం అంబేద్కర్ సెంటర్(హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్) వద్దగల భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహ ప్రాంగణం చుట్టూ వివిధ రకాల ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనపడకుండా చేస్తున్నారని, విగ్రహ ప్రాంగణం వద్ద చెత్తాచెదారం కూడా వేస్తున్నారని, అంతేగాక కొంతమంది విగ్రహం వెనుక గల ప్రదేశంలో మూత్ర విసర్జన కూడా చేస్తున్నారని, అందువలన ఆ ప్రాంగణమంతా చెత్తాచెదరంతో నిండి దుర్గంధ పూరితంగా ఉంటున్నదని, ఫ్లెక్సీల వ్యాపారానికి అడ్డాగా మారిందని, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం పక్కన గల ఖాళీ స్థలంలో త్వరలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం కూడా నెలకొల్పనున్నామని, వెంటనే మున్సిపల్ అధికారులు గానీ వేరే అధికారులు గానీ స్పందించి ఆ ప్రాంగణాన్ని దత్తత తీసుకొని వెంటనే అక్కడ ఫ్లెక్సీలు పెట్టకుండా చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకొని ఆ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ వేసి పరిశుభ్రంగా ఉంచేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి అట్టి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా బుక్ చేస్తామని భారతరత్నం అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కవి, సినీ గీత రచయిత, గాయకులు, సమాజసేవకులు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ హెచ్చరించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘ నాయకులందరూ హాజరై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అత్యవసర సమావేశానికి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అధ్యక్షత వహిస్తూ " భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను వాటి ప్రాంగణాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని, అలా కాకుండా అంబేద్కర్ విగ్రహాలను వాటి ప్రాంగణాలను అపరిశుభ్రపరచి అవమానపరిచేటట్లుగా చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను బుక్ చేస్తామని ఆచార్య డాక్టర్ మద్దెల హెచ్చరించారు. చివరగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఈ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని మహనీయుల ప్రాంగణంగా అభివర్ణిస్తూ అక్కడ పెట్టిన వాటన్నిటిని తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసి పరిరక్షించే విధంగా అధికారులు చర్యలు తీసుకునేటట్లుగా బాధ్యత వహించాలని స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకి విజ్ఞప్తి చేశారు. ఈ అత్యవసర సమావేశంలో సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తోపాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా హనుమంతు సంఘ గౌరవాధ్యక్షులు అపరబాలు అల్లి శంకర్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందా వెంకన్న సంఘ రాష్ట్ర ఆర్గనైజర్ స్టీవెన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం

- ఎన్నో ఆటుపోట్లను చూసిన ఉక్కుగుండె కేసీఆర్ ది
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు గంధం శివకుమార్

**కొత్తగూడెం, మార్చి17(కెరటం ప్రతినిధి)**



బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమమని, సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉండగా ఈడీ సోదాలపేరుతో అరెస్టు చేసి ఏడు రోజులు కస్టడీకి అప్పగించడం దుర్మార్గమని, తెలంగాణ ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నదని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు గంధం శివకుమార్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ సీరియల్ తలపించేలా ఇన్ని రోజులు విచారణ పేరుతో అయోమయానికి గురిచేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ తీరా లోకసభ ఎన్నికలకు ముందు అకారణంగా అరెస్టు చేయడం రాజకీయ కక్షల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడమేనని దుయ్యబట్టారు. ఇది చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమేనన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రగతి పథంలో ముందుకుపోయిన రాష్ట్రాన్ని చెల్లాచెదురు చేసి తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు బీజేపీ జాతీయ నేతలు పన్నిన రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. రాజకీయ కుయుక్తులతో తెలంగాణ సాధకుడు కేసీఆర్ మనోధైర్యాన్ని ఇంచుక మందం కూడా కదిలించలేరని, ఇటువంటి ఎన్నో ఆటుపోట్లను చూసిన ఉక్కుగుండె కేసీఆర్‌ది అన్నారు. ఇటువంటి చర్యలకు బెదిరేదిలేదనీ, ఎంఎల్సీ కవితకు యావత్ తెలంగాణ సమాజం అండగా నిలుస్తుందని స్పష్టం చేసారు.